క్లుప్తంగా

స్వచ్ఛతపై అవగాహన అవసరం



ర్యాలీలో మాట్లాడుతున్న స్టేషన్ మేనేజర్ రమేష్

సామర్లకోట: స్వచ్ఛత అభియాన్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని రైల్వే స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ అన్నారు. భారతీయ రైల్వే బోర్డు ఆదేశాల మేరకు శుక్రవారం నుంచి ఆగస్టు 15 వరకు నిత్యం పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీలు నిర్వహించి, పరిసరాలను శుభ్రం చేయనున్నట్టు తెలిపారు. స్వచ్ఛతపై ప్రయాణికులు అవగాహన పెంచుకోవాలని, ప్లాట్‌ఫాంపై వ్యర్థాలను పడేయకుండా డస్ట్‌బిన్‌లలో మాత్రమే వేయాలని ఆయన సూచించారు. రైలు పట్టాల మధ్య చెత్త వేసేవారిపై అపరాధ రుసుం విధిస్తామని ఆయన హెచ్చరించారు. అనంతరం రైల్వే స్టేషన్ ఆవరణలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి, స్టేషన్ సూపరింటెండెంట్ అనంత లక్ష్మి హౌస్ కీపింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు



హుస్సేన్‌పురంలో వితంతు పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే రాజప్ప

సామర్లకోట: అర్హులందరికీ సామాజిక పింఛన్లు అందజేస్తున్నట్టు ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప అన్నారు. మండల పరిధిలో హుస్సేన్‌పురంలో కొత్తగా మంజూరైన పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మార్ని నాగమణి, ఎంపీడీఓ కె.హిమ మహేశ్వరి పాల్గొన్నారు. ఆయా గ్రామాలలో, పట్టణ పరిధిలోని వార్డులలో టీడీపీ నాయకులు కొత్తగా మంజూరైన వితంతు పింఛన్లను అందజేశారు.

పారిశుధ్యంపై అవగాహన అవసరం



పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఈఓ లక్ష్మణరావు

కొత్తపల్లి: పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని జెడ్పీ సీఈఓ లక్ష్మణరావు పంచాయతీ సిబ్బందికి సూచించారు. స్థానిక చెత్త నుంచి సంపద కేంద్రాన్ని ఆయన పరిశీలించి అనంతరం గ్రామంలో పర్యటించారు. తడి, పొడి చెత్త వేరు చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించారు. పంచన్ల పంపిణీ పరిశీలించి లబ్ధిదారుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో హరికృష్ణా రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

సుఖీభవకు 7,104 మంది అర్హులు

సామర్లకోట: మండల పరిధిలో 7,104 మంది రైతులు అన్నదాత సుఖీభవకు అర్హత సాధించారని మండల వ్యవసాయాధికారి వి.మురళీధర్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ శనివారం రైతుల బ్యాంకు ఖాతాల్లో అన్నదాత సుఖీభవ ఆర్థికసాయం నమోదు అవుతుందని తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.3.55 కోట్లు, కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.1.32 కోట్లు అందుతాయని వివరించారు. ఈ మేరకు మొదటి విడతగా శనివారం రాష్ట్ర ప్రభుత్వం నుంచి అన్నదాత సుఖీభవ రూ.ఐదు వేలు, కేంద్ర ప్రభుత్వ పీఎం కిసాన్ నుంచి రూ.రెండు వేలు జమ అవుతాయని తెలిపారు. మొదటి విడతలో కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం అందే అవకాశం లేదని పేర్కొన్నారు. ఈ మేరకు అక్టోబర్‌లో కౌలు రైతుల ఖాతాలకు రూ.14 వేలు జమ అవుతాయని వివరించారు. అదే నెలలో రెండో విడత రైతులకు అందుతుందన్నారు. జనవరిలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.నాలుగు వేలు, కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.రెండు వేలు జమ అవుతాయని తెలిపారు. జనవరి నెలలో కౌలు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.ఆరు వేలు జమ అవుతాయని వివరించారు. ప్రభుత్వ పథకాలు అందడానికి ప్రతి రైతు ఈకేవైసీ చేయించుకోవాలని ఆయన సూచించారు.

విద్యాహక్కు చట్టం అమలుకు కృషి

కిర్లంపూడి: విద్యాహక్కు చట్టం అమలుకు కృషి చేస్తున్నట్టు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జి.శ్రీకాంత్ తెలిపారు. స్థానిక ఏఎన్ఎల్ పాఠశాలలో శుక్రవారం ఎస్ఎఫ్ఐ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ మండల నూతన అధ్యక్షుడిగా రౌతు నాని, కార్యదర్శిగా కీర్తి మణికంఠ, జాయింట్ సెక్రటరీలుగా మోహన్, సతీష్, మనోజ్, పలువురు కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సిద్దు, నరసింహమూర్తి, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మపై అలసత్వమా?

- సీహెచ్‌సీలో నిలచిన పీపీ సేవలు
- మరో చోటుకు వైద్య బృందం తరలింపు
- అవస్థలు పడుతున్న గర్భిణులు, బాలింతలు, చంటి పిల్లలు

అమ్మతనంతోనే స్త్రీజన్మకు సార్థకం. అమ్మా అని పిలిపించుకోవడానికి అవసరమైతే తన తనువునే త్యాగం చేయగల ధీశాలి. గర్భం ధరించింది మొదలు ప్రసవం వరకు తనలోని పిండాన్ని శిశువుగా రూపొందించేంత వరకు ఆమె తీసుకునే శ్రద్ధ అనన్య సామాన్యం. తనకి ఇష్టమున్నా లేకపోయినా తన కడుపులోని జీవి ఎదుగుదలకు అవసరమైన ఎన్నో మందులు, మాకులను వైద్యులు, ఇంటిలోని పెద్దల పర్యవేక్షణలో అత్యంత ప్రీతిగా తీసుకుంటుంది. ప్రసవించేదాకా తీసుకునే జాగ్రత్తలు, శ్రద్ధ ఒక ఎత్తయితే.. ప్రసవానంతరం పుండైన తనువును సహజస్థితికి తీసుకువచ్చేందుకు ఆ అమ్మ ఎంతో కష్టాన్ని ఎదుర్కొంటుంది. ఈ క్రమంలో ఆమెకు ఎన్నో వైద్య సేవలు, ఇతరుల సాయాలు అవసరమవుతాయి. వాటిని అందించేందుకు ప్రభుత్వాలు పలు ఆస్పత్రులలో వనరులు సమకూర్చి, వైద్య బృందాన్ని సైతం ఏర్పాటు చేసింది. ప్రసవానంతర సేవలు సకాలంలో సక్రమంగా అందకపోతే తదనంతర కాలంలో ఆ అమ్మకు ఎంతో నష్టం కలిగే అవకాశాలే ఎక్కువ. అంత ప్రాముఖ్యమున్న వైద్య సేవలను ప్రతి అమ్మకూ అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఎంతైనా ఉంది.



ప్రస్తుతం పీపీ యూనిట్ ఏర్పాటు చేశామని చెబుతున్న పిఠాపురం యూపీహెచ్‌సీ



పిఠాపురం ప్రభుత్వాస్పత్రిలో పీపీ యూనిట్ ఏర్పాటు చేసిన భవనం

పిఠాపురం: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గర్భిణులు, బాలింతలకు వైద్య సేవలు అందించాల్సిన పోస్టు పార్టం (ప్రసవానంతర సేవలు) యూనిట్‌ను మూసివేశారు. నియోజకవర్గంలోని 2.5 లక్షల జనాభాతో పాటు ఇతర నియోజకవర్గాల మహిళలకు ప్రసూతి వైద్య సేవలు అందించిన ఈ యూనిట్‌ను ఆస్పత్రి వర్గాలు గుట్టు చప్పుడు కాకుండా మూసివేయడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. సాధారణంగా ఆస్పత్రిలో ప్రసవానంతరం ట్యూబెక్టమీ ఆపరేషన్లు, తల్లీపిల్లకు వైద్య సేవలు, వ్యాక్సినేషన్లను ఈ యూనిట్ సిబ్బంది పర్యవేక్షణలోనే నిర్వహిస్తుంటారు. ప్రతి రోజు పిఠాపురం ప్రభుత్వాసుపత్రిలో సుమారు 10 శస్త్రచికిత్సలు నిర్వహిస్తుండే వారు. ఇక్కడ ఒక వైద్యుడు, ఏడుగురు సిబ్బంది పని చేస్తుండేవారు. కానీ గత రెండు నెలలుగా ఈ యూనిట్‌ను పూర్తిగా మూసివేశారు. ఇక్కడి సిబ్బంది ఎక్కడ పని చేస్తున్నారో కూడా తెలియని అయోమయ పరిస్థితి నెలకొందని బాలింతలు వాపోతున్నారు. సీహెచ్‌సీలో పని చేయాల్సిన పీపీ యూనిట్‌ను మూసి వేసిన ఆస్పత్రి సిబ్బందిని పిఠాపురం పట్టణం మంగయ్యమ్మరావుపేటలో ఉన్న యూపీహెచ్‌సీకి పంపించారని, అక్కడకు వెళితే సాధారణ వైద్య సేవలు తప్ప ఏమీ చేయడం లేదని బాలింతలు వాపోతున్నారు. సీహెచ్‌సీలో అభివృద్ధి పనులు చేపట్టడం వల్ల పీపీ యూనిట్ మూసి వేసినట్లు ఆస్పత్రి వర్గాలు చెబుతుండగా అత్యంత అవసరమైన వైద్య సేవలను నిలిపివేయడమేమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై సీహెచ్‌సీ సూపరింటెండెంట్ సుజాతను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరు.

ఆగిపోయిన శస్త్రచికిత్సలు


సాధారణంగా పీపీ యూనిట్‌లో ట్యూబెక్టమీ ఆపరేషన్లు నిర్వహించాల్సి ఉంది. కాని ఇక్కడ నియమించిన వైద్యాధికారికి ఆ శస్త్రచికిత్సలు చేయడం రాదని అందువల్లే చేయడం లేదని చెబుతున్నారు. దీనికి తోడు యూపీహెచ్‌సీలో ఆపరేషన్ థియేటర్ సదుపాయం కూడా లేదు. అత్యంత అవసరమైన శస్త్రచికిత్సలు చేయడం రాని వైద్యాధికారిని ఇన్‌చార్జిగా ఎలా నియమించారని బాలింతలు, వారి తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై ఇక్కడ డాక్టర్‌గా నియమించబడ్డ సూరవరపు తులిసి వివరణ కోరగా తనకు ఆపరేషన్లు చేయడం రాదని త్వరలోనే శిక్షణ ఇస్తామని, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులు తెలిపారన్నారు. ప్రస్తుతం వైద్య సేవలు మాత్రమే అందిస్తున్నామన్నారు. ఆపరేషన్లు అవసరమైన వారిని కాకినాడ రిఫర్ చేస్తున్నామన్నారు. అత్యంత అవసరమైన పీపీ యూనిట్‌ను సీహెచ్‌సీలోనే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పీపీ యూనిట్ పని చేయకపోతే ఇబ్బందే

పిఠాపురం ప్రభుత్వాసుపత్రిలో పురుడు పోసుకున్న వారికి మా ఆధ్వర్యంలో ఆపరేషన్లు చేసేస్తుంటాము. కానీ బయటి ఆస్పత్రుల్లో ప్రసవించిన వారికి పీపీ యూనిట్‌లో ఆపరేషన్లు చేయాల్సి ఉంది. కాని ప్రస్తుతం ఇక్కడి యూనిట్ పని చేయడం లేదు. ఉన్న సిబ్బందిని వేరే చోటకు మార్చారు. అక్కడైనా ఆపరేషన్లు చేసే అవకాశం లేదు. ఎందుకంటే యూనిట్ ఇన్‌చార్జ్ వైద్యాధికారికి ఆపరేషన్లు చేసే పరిస్థితి లేదు. వారికి ఆపరేషన్లు చేసే విధంగా శిక్షణ ఇవ్వాల్సి ఉంది. శిక్షణ పూర్తయిన వెంటనే ఆపరేషన్లు చేసే పరిస్థితి కూడా ఉండదు. అందుకని ప్రస్తుతం పీపీ యూనిట్ లేక పోవడం వల్ల చాలా మంది ఇబ్బందిపడడం వాస్తవమే. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాము. అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.

– సుజాత, సూపరింటెండెంట్, సీహెచ్‌సీ, పిఠాపురం

మరిడమ్మకు ప్రత్యేక పూజలు



పూజలు అందుకుంటున్న మరిడమ్మ తల్లి

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పు పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి



పెద్దాపురంలో నిరసన తెలియజేస్తున్న విద్యార్థులు

పెద్దాపురం: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని పీడీఎస్‌యూ డిమాండ్ చేసింది. పట్టణంలో యూనియన్ ఆధ్వర్యంలో శనివారం నిరసన చేపట్టింది. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ విజృంభణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కడితి సతీష్ మాట్లాడుతూ విద్యారంగ అభివృద్ధిని కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆరు వేల కోట్లు బకాయిలు చెల్లించకపోవడంతో అటు విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థులను వేధిస్తున్నారన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిద్దాం

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న విశ్వనాథం

పెద్దాపురం: అదానీతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం ప్రకారం వేస్తున్న స్మార్ట్ మీటర్లను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల ఐదో తేదీన విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని ప్రజావేదిక పిలుపునిచ్చింది. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో శుక్రవారం సిరిపురపు శ్రీనివాస్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లు పెట్టిన షాపుల వాళ్లు విద్యుత్ బిల్లులు చూసి గుండెలు బాదుకుంటున్నారన్నారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేట్ వాళ్లకు అప్పగించేందుకు ముందస్తుగా స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారన్నారు. ఒక్కసారి స్మార్ట్ మీటరు బిగిస్తే మనం ఆ ఏర్పాటును అంగీకరించినట్టేనని, దీనిని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. ఇప్పటికే వేసిన వాటిని తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నీలపాల సూరిబాబు, చల్లా విశ్వనాథం, డి.క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి



పిఠాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

పిఠాపురం: సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా విద్యుత్ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తు పట్టణంలోని స్థానిక 29, 30వ వార్డుల్లో శుక్రవారం సీపీఎం నాయకులు ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నుంచి చర్చి సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కన్వీనర్ కుంచె చిన్న, కోనేటి రాజు మాట్లాడుతూ ఎన్నికల ముందు మీ ఇంటికి స్మార్ట్ మీటర్లు బిగించడానికి వస్తే పగలగొట్టండని నారా లోకేష్ చెప్పారని, కానీ నేడు స్మార్ట్ మీటర్లు తీసుకువచ్చి బిగించేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని అలాగే ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని, విద్యుత్ భారాలు ప్రజలపై మోపరాదని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కె.నాగేశ్వరరావు, మణి, సూర్యనారాయణ, జి వీరబాబు, విశ్వనాథం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కోసం రైతుల పాట్లు



ఎరువుల కోసం సామర్లకోట రైతు సేవా కేంద్రం వద్ద అన్నదాతల పడిగాపులు

సామర్లకోట: మండల పరిధిలో 80 శాతం వరకు వరినాట్లు పూర్తి కావడంతో రైతులు ఎరువుల కోసం ఎదురు చూస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం స్థానిక రైతు సేవా కేంద్రానికి ఎరువులు రావడంతో రైతులు పరుగులు తీశారు. ఒకేసారి అధిక సంఖ్యలో రైతులు రావడంతో అక్కడి సిబ్బంది ఆధార్ కార్డులను తీసుకుని సీరియల్ నెంబరు కూపన్లు ఇచ్చారు. ప్రస్తుతం వరి చేలకు యూరియా కావలసి ఉండగా డీఏపీ మాత్రమే వచ్చిందని రైతులు ఆరోపించారు. ప్రతి రైతుకు ఎకరానికి ఒక బస్తా డీఏపీ ఇచ్చినట్టు మండల వ్యవసాయాధికారి వి.మురళీధర్ తెలిపారు. సామర్లకోట ప్రాథమిక సహకార సంఘంలో కూడా ఎరువులు విక్రయించేలా ఏర్పాట్లు చేస్తామని, దాంతో కొంత మేర రద్దీ తగ్గుతుందన్నారు. పట్టణ పరిధిలో సుమారు 8 ఎరువులు, పురుగు మందుల దుకాణాలు ఉండగా ఆయా షాపులలో ఎరువులు లభించక పోవడంతో రైతు సేవా కేంద్రాలకు వస్తున్నారని తెలిపారు. ప్రతి రైతుకు ఎరువులు అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ఈ మేరకు ఐదో తేదీన మరో లోడు వస్తుందని రైతులు ఆందోళన చెందవలసిన పని లేదన్నారు. లిక్విడ్ యూరియా, లిక్విడ్ డీఏపీలపై రైతులకు అవగాహన పెంచుతున్నామని తెలిపారు.

స్వచ్ఛమైన తాగునీరు అందించండి



మున్సిపల్ కుళాయిల నుంచి వచ్చిన నాచురంగు, నురగతో ఉన్న తాగునీరు

సామర్లకోట: పట్టణ ప్రజలకు మున్సిపాలిటీ సరఫరా చేస్తున్న తాగునీటి నాణ్యత ఎప్పుడు మెరుగవుతుందో తెలియడం లేదని పలు వార్డుల కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాచు రంగులో, నురగతోనే తాగునీటి విడుదల చేస్తున్నారని కౌన్సిలర్ ఆవాల లక్ష్మీనారాయణ ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య, ఇంజినీరింగ్ అధికారులు వార్డులో తాగునీటిని పరిశీలించారు. కౌన్సిలర్లు ఆవాల లక్ష్మీనారాయణ, మాజీ కౌన్సిలరు కాళ్ల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఫిల్టర్ చెరువులో నీటి మట్టం తక్కువగా ఉండడం వలన నీరు ఫిల్టరు కావడంలేదని మూడు రోజులలో సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారని స్వచ్ఛమైన తాగునీరు అందకపోతే ప్రజలు అనారోగ్యానికి గురవుతారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుధ్యం, లైటింగ్, తాగునీరు అందించవలసిన బాధ్యత మున్సిపాలిటీపై ఉన్నదని, అయితే అధికారులు వాటిని విస్మరించారని వారు పేర్కొన్నారు.

తల్లి పాలు బిడ్డకు దివ్య ఔషధం

- సీడీపీఓ ఉష



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీడీపీఓ ఉష

సామర్లకోట: తల్లి పాలు బిడ్డకు దివ్య ఔషధమని ఐసీడీఎస్ సీడీపీఓ జి. ఉష పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక అమ్మాణమ్మ అపార్టుమెంటులోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లులు, గర్భిణులు, బాలింతలకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. తల్లి పాలపై మహిళలకు అవగాహన పెరగాల్సి ఉందన్నారు. తల్లి పాలలో అనేక పోషకాలు ఉండడం వలన బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాలల్లో ఆరు నెలల నుంచి ఏడేళ్ల వరకు పోషక విలువలతో కూడిన ఆహారం అందించడం జరుగుతుందన్నారు. అలాగే గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాలో అందించే పోష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఎస్.రమాదేవి, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు పాల్గొన్నారు.

తల్లిపాలే వ్యాధి నిరోధక టీకా



కొండెవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

కొత్తపల్లి: బిడ్డ పుట్టిన వెంటనే గంటలోపు తల్లి పాలు ఇవ్వాలని, అవే బిడ్డకు ప్రథమ వ్యాధి నిరోధక టీకా అని సెక్టార్ సూపర్వైజర్ సారమ్మ అన్నారు. మండలంలోని కొండెవరం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. బిడ్డకు తల్లి పాలు ఇవ్వడం వల్ల పలు ఆరోగ్య సమస్యలు దూరమవుతాయని ముఖ్యంగా రొమ్ము, గర్భాశయం క్యాన్సర్ వంటి వ్యాధులు నియంత్రించవచ్చునని అన్నారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇదేం తీరువా..!



నీటి తీరువా కట్టాలంటూ గొల్లప్రోలులో మైక్‌లో ప్రచారం చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

పిఠాపురం: నీరు లేదు, నారు వేసే అవకాశం లేదు అంటు రైతులు గగ్గోలు పెడుతుంటే పట్టించుకునే అధికారి లేరు గాని నీటి తీరువా కట్టకపోతే ఇబ్బంది పడతారంటు ప్రచారం చేయడానికి మాత్రం అధికారులు ఉత్సాహం చూపించడం పట్ల రైతులు ముక్కున వేలేసుకుంటున్నారు. నీటి తీరువా కట్టాలంటూ గొల్లప్రోలు మండలంలో రెవెన్యూ అధికారులు మైకులు పట్టుకుని మరీ ప్రచారం చేస్తుండడం చూసిన రైతులు నీరు అడిగినప్పుడు కనిపించకుండా పోయిన మీరు నీటి తీరువాకు మాత్రం వచ్చేస్తారా అంటు ప్రశ్నిస్తున్నారు.

త్వరలో కొత్త రేషన్ కార్డులు



సమావేశంలో మాట్లాడుతున్న తుమ్మల పద్మజ

పెద్దాపురం: త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా కొత్త రేషన్ కార్డులు మంజూరవుతాయని రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ తుమ్మల పద్మజ అన్నారు. శుక్రవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ క్యూ ఆర్ కోడ్‌లతో కూడిన డిజిటల్ రేషన్ కార్డులు ఇవ్వనున్నామన్నారు. ఎటువంటి రాజకీయ నేతల ఫొటోలు లేకుండా డెబిట్ కార్డు తరహాలో ఈ రేషన్ కార్డులు ఉంటాయన్నారు. ఐదేళ్ల లోపు, 80 ఏళ్లు దాటిన వారికి ఎటువంటి ఈకేవైసీ అవసరం లేదన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్ పంపిణీ జరుగుతుందన్నారు. 25వ తేదీ నుంచి 30వ తేదీ వరకు వృద్ధులు, రోగుల ఇళ్లకు రేషన్ డోర్ డెలివరీ ఉంటుందని పద్మజ తెలిపారు.

ప్రాథమిక పాఠశాలలను కాపాడాలి

- ఉపాధ్యాయులకు డీఈఓ రమేష్ పిలుపు
- సెప్టెంబర్ 30 నాటికి విద్యార్థులకు చదవడం, రాయడం నేర్పాలని ఆదేశం



ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతున్న డీఈఓ రమేష్

సామర్లకోట: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను కాపాడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉన్నదని జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ అన్నారు. శుక్రవారం స్థానిక సత్యనారాయణపురంలోని మేరీ ఇమ్మాక్యులేట్ పాఠశాలలో ఎంఈఓల అధ్యక్షతన ప్రాథమిక, ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలన్నారు. ప్రాథమిక స్థాయిలో అనేక మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలో చేరుతున్నారని, హైస్కూల్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలకు వస్తున్నారని తెలిపారు. దీని కారణంగా ప్రాథమిక స్థాయిలో బోధన సక్రమంగా ఉండటం లేదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయని తెలిపారు. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రాథమిక పాఠశాలలు మూతపడే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. ఈ స్థాయిలో ప్రతీ విద్యార్థి చదవడం, రాయడంపై శ్రద్ధ చూపాలన్నారు. ఎక్కాలపై విద్యార్థులు దృష్టి పెడితే గణితంపై శ్రద్ధ పెరుగుతుందని వివరించారు. ప్రతి పాఠశాలలోని విద్యార్థులకు సెప్టెంబరు 30 నాటికి చదవడం, రాయడం అలవాటు కావాలని, లేకుంటే ఉపాధ్యాయులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అలాగే చేతి రాతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఇళ్లకు వెళ్లిన తరువాత తల్లిదండ్రులకు కూరగాయలు, పండ్ల పేర్లను ఆంగ్లంలో చెప్పడం ద్వారా తల్లిదండ్రులలో ఉత్సాహం పెరుగుతుందన్నారు. ఎంఈఓ వై.శివరామకృష్ణ మాట్లాడుతూ డీఈఓ సూచనలను మండలంలో అమలు జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీబీ సెక్రటరీ వెంకటరావు, ఎంఈఓ 2 పి. పుల్లయ్య హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి శిక్షణ



దశపర్ణిక కషాయం తయారీ విధానాన్ని తెలుసుకుంటున్న సిబ్బంది

పిఠాపురం: కోనసీమ, అల్లూరి సీతారామరాజు, కాకినాడ జిల్లాకు చెందిన ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బందికి శుక్రవారం గొల్లప్రోలు మండలం చేబ్రోలులో శిక్షణ ఇచ్చారు. ప్రకృతి వ్యవసాయంపై అవగాహన, శిక్షణ కార్యక్రమానికి మూడు జిల్లాల నుంచి 40 మంది సభ్యులు హాజరయ్యారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో వెంకటరమణ, కత్తిపూడిలో గాబు బాబ్జీ తదితరులు పలు విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం జి.రాగంపేటలో పాటి శ్రీనివాస్ శిక్షణ కేంద్రంలో దశపర్ణికషాయం, అగ్ని అస్త్రం, బ్రహ్మాస్త్రం, చిల్లి స్పెషల్ కషాయాలు తయారు చేస్తూ వాటి ఉపయోగాలు, వాడే విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పీఎంయూ కమ్యూనిటైజేషన్ జానకి, కాకినాడ డీపీఎం ఏలీయాజార్, గుండ్ర శివచక్రం తదితరులు పాల్గొన్నారు.

రూ.18 లక్షల వార్షిక ప్యాకేజీతో జేఎన్‌టీయూకే విద్యార్థుల ఎంపిక

బాలాజీచెరువు (కాకినాడ): జేఎన్‌టీయూకే (యూపీఈకే) ప్లేస్‌మెంట్ డ్రైవ్ 2025–26లో యూనివర్శిటీ ఇంజినీరింగ్ కళాశాలలో జూలై 29న నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో ప్రముఖ బ్యాంకింగ్ టెక్నాలజీ కంపెనీ జిటా ద్వారా కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ విద్యార్థులు నలుగురు ఎంపిక కావడం గర్వకారణంగా ఉందని వీసీ సీఎస్ఆర్‌కే ప్రసాద్ తెలిపారు. సీఎస్ఈ విభాగం నుంచి పిచ్చిక హర్షవర్ధన్, వేలగ సీహెచ్ఎస్ఎస్‌వీఎల్.వైష్ణవి, చల్లా ప్రీతి, గుడ్డటి వెంకట శ్రీ సుమేధ ఎంపికయ్యారు. వీరికి రూ.18 లక్షల వార్షిక ప్యాకేజ్‌గా నిర్ణయించారు. ప్రతి నెలకు రూ.60 వేలు స్టైఫండ్ ఇస్తారన్నారు.ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌రావు, వీసీ ప్రసాద్ అభినందించారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కోటనందూరు: సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని తుని రూరల్ సీఐ జి.చెన్నకేశవరావు సూచించారు. స్థానిక శ్రీసాయి జూనియర్ కాలేజీ, జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ చెన్నకేశవరావు మాట్లాడుతూ విద్యార్థులు జీవితాన్ని సర్వనాశనం చేసే మత్తు పదార్థాల జోలికి పోకూడదన్నారు. సైబర్‌నేరాలు, మహిళల భద్రత, రోడ్డు ప్రమాదాలు, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, గంజాయి, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.

నంబర్‌ప్లేట్లు లేని వాహనాలకు జరిమానా

స్థానిక బస్టాండు సెంటర్లో శుక్రవారం సాయంత్రం ఎస్సై రామకృష్ణ వాహనాల తనిఖీ నిర్వహించారు. సరైన రిజిస్ట్రేషన్ నంబర్‌ప్లేట్లు లేని 10 మోటార్ వాహనాలను అదుపులోకి తీసుకొని జరిమానా విధించారు. కార్లపై నల్ల అద్దాలు వినియోగించరాదని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వాహనదారులకు సూచించారు.